# చుట్టపుచూపు

"ఏం కాలం వచ్చి పడిందమ్మా, నరసమ్మా! ఒక అతిథిసత్కారం కాని బంధుమర్యాదగాని ఏమీ లేదు," అన్నాడు ఏభైఅయిదేళ్ళ శఠగోపం అప్పుడే భోజనం చేసివచ్చి వాలుకుర్చీలో నడుం వాలుస్తూ.

ఆకులూ, వక్కలూ, సున్నమూ తెచ్చి వాలుకుర్చీ ప్రక్క ఒక చిన్న బల్లమీద పెట్టింది నరసమ్మ.

"అందులోనూ మీ ఆడబడుచు శాంతమ్మకి అసలు బంధుప్రీతి బొత్తిగా తెలీదు," అన్నాడు శఠగోపం మళ్ళీ ఉపోద్ఘాతంగా.

సాధారణంగా ఆడబడుచుమీద విమర్శ వస్తే, చాలమంది ఆసక్తితో వింటారు. నరసమ్మకూడా ఉత్సాహంతో క్రింద చాపమీద చతికిలబడింది వినడానికి.

శఠగోపం ఒక కమీషను ఏజెంటు. హైదరాబాదుకి ఏదో పనిమీద వచ్చి గత వారంరోజులనుంచీ మాధవరావు ఇంట్లో తిష్టవేశాడు. ఆయన మాధవరావు భార్య నరసమ్మతాలూకు అమ్మమ్మగారి తోడికోడలి కొడుకు! 'ఆలివంక చుట్టం ఆత్మబంధువు' అన్నారు. అందుచేత ఇంకా ఏమీ అనలేకపోయాడు. అయినా ఎందుకేనా మంచిదని మొదటినుంచీ కలివిడిగా మాట్లాడడం మానేశాడు.

మాధవరావు హైదరాబాదులో చీఫ్ ఇంజనీరు ఇరిగేషను ఆఫీసులో అప్పర్ డివిజన్ గుమాస్తాగా ఉంటున్నాడు. మాధవరావు చెల్లెలు శాంతమ్మ విశాఖపట్నంలో కాపురం చేస్తోంది. శాంతమ్మ వయస్సు ముప్పది సంవత్సరాలు; ఆమె భర్త గోవిందరావు విశాఖపట్నం కలెక్టరాఫీసులో గుమాస్తాగా పని చేస్తున్నాడు అతని వయస్సు ముప్ఫయ్యైదు సంవత్సరాలు.

"అయితే మీ ఆడబడుచు మొగుడు, గోవిందరావు చాలా కలుపుగోరు మనిషి. స్నేహితులన్నా చుట్టాలన్నా చాలా అభిమానం చూపిస్తాడు ఇంతకూ ఆయన మన కేమీ దూరపుచుట్టం కాడులే. ఇప్పుడు నువ్వు మా అమ్మ తోటికోడలి మనుమరాలివి కదా. ఆయన మా అమ్మ పిన్నత్తగారికి స్వయానా వేలువిడిచిన మేనమామ మనుమడు!"

నరసమ్మకి అర్థం కాలేదు. అర్థం కాలేదంటే 'ఇప్పటివాళ్ళ కేమీ అర్థం కావమ్మా. చెప్పినా అర్థం కాదు.' అనేస్తాడని భయపడి అడగలేదు.

"ఇంతకూ చెప్పొచ్చే దేమంటే, మీ

వి. వి. ఎస్. రామదాసు



ఆడబడుచు శాంతమ్మ వాళ్ళ ఆయన తరపు చుట్టాలని అయినా మమ్మల్ని తగినంత మర్యాద చేయడం లేదు,'' అన్నాడు శఠగోపం.

''ఆవిడ గుణమే అంత'' అంది పరసమ్మ.

''బాగా చెప్పావమ్మా. ఇంతకూ విజయనగరం డివిజన్ ఆఫీసునుండి మా అబ్బాయి వెంకట్రావుకి విశాఖపట్నం బదిలీ అవడంవల్ల ఆవిడకి అలుసై పోయింది. ఏదో మనవా దొకడు విశాఖ పట్నంలో ఉన్నాడు కదా అని వాళ్ళ యింటికి వెళ్లాము. మా కోడలు సుందరమ్మ మా అబ్బాయిని విడిచి ఒక క్షణం

అయినా ఉండలేదు. అందుచేత ఆవిడ బయలుదేరింది. కొడుకునీ కోడల్నీ చూడకుండా మీ పిన్నత్త సాంబారమ్మ ఉండలేదు కదా! అందుకని ఆవిడా బయలుదేరింది. ఇక వాళ్ళు ముగ్గురూ లేనిదే నేనొక్కడ్నీ విజయనగరంలో ఉండలేక నేనూ బయలుదేరాను."

"మంచి పని చేశావు మామయ్యా." అన్నది నరసమ్మ తన అడబడుచుకు వచ్చిన ఇబ్బందికి లోలోన సంతోషిస్తూ.

"మనుష్యు లంతా వచ్చేసిన తరువాత సామాను వదిలేయడమెందుకు. అద్దె ఉండుగ కని సామానుకూడా మన వాళ్ళింటికి తరలించాము."

"చాలా మంచిపని చేశావులే మామయ్యా!" అన్నది నరసమ్మ మరింత సంతోషిస్తూ.

"సరేగాని నరసమ్మా! కాఫీ పెట్టు. ఆ చేత్తోటే కాస్త నెయ్యి వేసి రెండంటే రెండు పెసరట్లు వెయ్యి." అని పురమాయించాడు శఠగోపం.

కాఫీ నీళ్ళు పెట్టడానికి లేచింది నరసమ్మ.

* * *

శఠగోపాన్ని వదిలించుకోవడం ఎట్లాగాఅని మాధవరావుకి అర్థం కాని సమస్య అయింది.

చుట్టాలను మర్యాద చేయడం మాధవ రావుకి తెలియక కాదు. చుట్టాల యింట్లో ఏ విధంగా మసలుకోవాలో కూడా మాధవరావుకి తెలుసు.

ఒకసారి మాధవరావు తిరుపతి మొక్కుబడి తీర్చుకోడానికి వెళ్ళితే, తన బావగారి అన్నగారు తిరుపతిరావు గారు అక్కడ ఉన్నారని తెలిసికూడా, ఆయన ఇంటి చిరునామా తెలిసినప్పటికీ యాత్రికుడుగా వెళ్ళాడు కాబట్టి దేవ స్థానం సత్రంలోనే బసకోసం ప్రయత్నించాడు. ఆయన సామాన్లు దగ్గర నరసమ్మ నుంచి, ఎంక్వయిరీ ఆఫీసు దగ్గరకు వెళుతూఉండగా, దేవస్థానం ట్రాన్స్‌పోర్టులలో పనిచేస్తున్న తిరుపతి రావు ఆయన్ను చూసి. పలకరించి తన యింటికి రానందుకు ఎంతో నొచ్చుకున్నాడు.

తిరుపతిరావు వెంటనే వాళ్ళ సామాన్లను తన ఇంటికి మరలించాడు. వాళ్ళను ఎంతో ఆదరణతో ఇంటికి తీసుకొని వెళ్ళాడు. తిరుపతిరావు శెలవుపెట్టి, వాళ్ళ దగ్గర ఉండి, తిరుమలలో సౌకర్యంగా స్వామివారి దర్శనం అయేటట్లు చూడడమే కాకుండా, తిరుపతిలోని దేవాలయాలనూ, అలమేలు మంగాపురమూ, శ్రీ కాళహస్తీ, తిరుత్తనికూడా చూపించి తీసుకువచ్చాడు.

ఆయన కంటబడ్డ ఏ దగ్గర బంధువునైనా ఆయన ఆ విధముగా ఆదరిస్తాడు. అందుకనే ఆయనను బంధువులంతా 'చుట్టాల సురభి' అంటారు. అనగా




చుట్టాలకు కామధేనువువంటివా డనన్న మాట.

అయితే మాధవరావు చాలా మర్యాద తెలిసినవాడు. తిరుపతిరావుకి తనవల్ల భారం కాకుండా, కూరలు తెచ్చి పడేసే వాడు. ప్రయాణం ఖర్చులు, జట్కా. బస్సు వగైరా ఖర్చులు అందరికీ తానే పెట్టేవాడు. తిరుపతినుండి బయలుదేరి పోయేటప్పుడు తిరుపతికి పంచలచాపూ, ఆయన భార్యకి మంచి చీరా, పిల్లల చేతిలో పదిరూపాయలూ పెట్టి మరీ వచ్చాడు.

బంధుత్వం అనేది ఒక మృదువైన సంబంధం. ఆ మృదుత్వం నిలబెట్టు కోవాలి. లేకపోతే రసాభాసం అవు తుంది. అయితే మాధవరావుకిమల్లే, తిరుపతిరావుకిమల్లే, బంధువు లంతా ఉంటే అంతకంటే వేరే ఏం కావాలి? శఠగోపం వేరే తెగకు చెందినవాడు. ఆయన ప్రవర్తన ఎప్పుడూ వన్ వే ట్రాఫిక్కుని గుర్తుకు తెస్తుంది.

అసలే అది హైదరాబాదు; అందు లోనూ అది సనత్‌నగర్ 'కాలనీ'; దానిలో ఒకే గది; వంటిల్లు ఉన్న ఇంట్లో ఉంటున్నాడు మాధవరావు.

"నరసమ్మా! చలికాలం బయట పడుకోలేనమ్మా. మీ రిద్దరూ మంచం ఉన్నవాళ్లు కాబట్టి వంటింట్లో సర్దుకుం దురూ. నేను గదిలో పరుపు వేసుకుని పడుకుంటా. మరేం లేదు; వంటింట్లో చెమ్మగా ఉంటుంది కదూ! దాని వల్ల

పరుపు తడిసిపోతుందని," అన్నాడు శఠగోపం వచ్చినరోజు సాయంత్రమే.

కొళాయిలో నీళ్ళు ప్రొద్దున ఒక గంటా, సాయంత్రం ఒక గంటా మాత్రమే వస్తాయి.

"చూడు నరసమ్మా. నేను అర్జంటుగా ఊళ్లోకి వెళ్ళాలి. మీ ఆయన తొమ్మిదిన్నరకి కదా వెళ్ళేది. అందుచేత వేడినీళ్ళు ముందు నాకు తోర్లించమ్మా" అని పురమాయిస్తాడు శఠగోపం.

శఠగోపాన్ని వదిలించుకోవడం ఎట్లా అనేది మాధవరావుకి సమస్య అయి కూర్చుండి. శఠగోపంయొక్క కీర్తి సౌరభం, విశాఖపట్నంనుంచి గోవిందరావు వ్రాసిన లేఖలవల్ల అతనికంటే ముందే మాధవరావు ఇంటికి వ్యాపించింది. అందుకోసమే మొదటినుండీ కాస్త జాగ్రత్తగా ఉండాలని శఠగోపం వచ్చినరోజు మరీ పెద్ద ఆదరణ చూపలేదు మాధవరావు.

"ఆయన అదో మోస్తరు మనిషి మామయ్యా." అని నరసమ్మ సర్దబోయింది.

అయితే నరసమ్మ సహాయం అవసరం లేకుండానే సర్దుకుపోగలడు శఠగోపం.

"నాకు తెలీదుటమ్మా," అన్నాడు శఠగోపం.

నరసమ్మతో ఒకసారి నెమ్మదిగా మాధవరావు "ఇంకా ఎన్నాళ్లుంటుంది మన నెత్తిమీ దీ శఠగోపం," అన్నాడు.

"గట్టిగా అరవకండి. మామయ్య వింటే ఏమైనా అనుకుంటాడు," అన్నది నరసమ్మ ముక్కుకొనమీద వేలు వేసుకుంటూ.

"బాగానే ఉంది. మన మేమైనా ధర్మసత్రం తెరిచామా. ఏమన్నానా? ఇక్కడ ఈయనా, అక్కడ విశాఖపట్నంలో ఆయన కుటుంబం అంతా మా బావగారి ఇంట్లో నూ తిష్టవేసి కూర్చుంటే ఎలా భరించగలమే?"

"అబ్బ, నెమ్మదిగా మాట్లాడుదురూ, మామయ్య వింటాడు."

"వింటే విననీ. వినడానికే అంటున్నాను. విశాఖపట్నంలో పీళ్ళను వదిలించుకోలేక బావగారు చాలా కష్టపడుతున్నారు. జీతం చాలక జీ. పి. ఎఫ్. అడ్వాన్సుకూడా తెప్పించుకోవలసి వచ్చింది..."

"రాకరాక వచ్చిన బంధువులను గురించి ఏమీ అనకండీ!" అంది నరసమ్మ చిన్నబుచ్చుకుంటూ.

తరువాత సంభాషణ కొనసాగిస్తే రోదనాస్త్రం ప్రయోగించబడుతుం దని మాధవరావుకి తెలుసు. అందుచేత ఇక ఛార్యతో ఏమి అన్నా లాభం లేదనుకున్నాడు మాధవరావు.

బట్టలు వేసుకుని విసురుగా ఆఫీసుకు పోయాడు మాధరావు.

"ప్రాణం చాలా చిరాకుగా ఉన్నాదు అబ్బాయి," అన్నాడు సావిట్లో ఉన్న శఠగోపం తాపీగా.

"మా సంభాషణ విన్నావేంటి మామయ్యా?"

"నేనలా భార్యాభర్తల సంభాషణ వినను సుమా," అన్నాడు శఠగోపం.

మరునాటినుంచీ శఠగోపం కార్యక్రమం మార్చివేశాడు. ప్రొద్దున్నే స్నానంచేసి కాఫీ త్రాగి బయటికి పోతాడు. మళ్ళీ మాధవరావు ఆఫీసుకి పోయిన తరువాత, అనగా సుమారు పదకొండు గంటలకి ఇంటికి వస్తాడు.

"మీ ఆయన వచ్చేవేళకు చాలా ఆలస్యం అవుతుంది. నాకా, ఇప్పుడు సాయంత్రమే పని ఉంటున్నది. అందుచేత త్వరగా వంట కానిస్తే ఆరుగంటలకే భోజనం చేసిపోతాను. నీకు కూడా పని సుళువవుతుంది," అని పురమాయించి సాయంత్రం ఆరుగంటలకు భోజనం చేసి

బయలుదేరివోయి రాత్రి పదిగంటలకు వచ్చి నెమ్మదిగా తనకు సిద్ధంచేసి ఉంచిన పరుపుమీద పడుకుంటాడు.

"మీరు మజ్జిగ వేసుకుంటే వేసుకున్నారు; నాకుమాత్రం మధ్యాహ్నం కాస్త పెరుగు ఉంచండి," అని పురమాయిస్తాడు.

"మధ్యాహ్నం కాఫీలోకి ఏదయినా టిఫి నుండాలిసుమా. అదికూడా రోజూ ఒకటే అయితే ఏం బాగుంటుందీ: మార్చి మార్చి చేస్తూ ఉండాలి;" ఇది శఠగోపంగారి మరొక పురమాయింపు.

"సరేలే మామయ్యా:"

"అన్నట్టు చెప్పడం మరిచిపోయాను, నరసమ్మా: చెడ్డఅలవాటు నాకు. రాత్రి పడుకోబోయేముందు ఒకటో రెండో మినపసున్నిఉండలో లేక చేగోడీలో, కనీసం కారప్పూసయినాసరే ఏదో ఒకటి పరుపుప్రక్క చిన్న డబ్బాలో వేసి ఉంచుదూ. చప్పుడు లేకుండా తిని పడుకుంటా,'' ఇది మరొక పురమాయింపు.

"సరేలే మామయ్యా,'' అన్నది నరసమ్మ ఒకవంక మాధవరావు ఏమంటాడో నని భయపడుతూ.

"ఆ తరువాత కాస్త ఒకపావుశేరు వేడిపాలు ఫ్లాస్కులో పోసిఉంచితే సరిపోతుంది,'' అన్నాడు శఠగోపం.

ఈ పంపిణీమీద వ్యవహారం జరగడంవల్ల నెలరోజుల్లో మాధవరావు సేవింగ్సు సగానికిసగం తరిగిపోయింది. నిర్ణీతపథకం ప్రకారం జీవితం గడపాలనుకున్న మాధవరావు ఆదర్శం ఆదర్శంగానే మిగిలిపోయే ప్రమాదం వచ్చింది.

ఎంత పథకాలు వేసుకున్నవారికైనా అనుకోకుండా వచ్చిపడే అవాంతరాలు కొన్ని ఉంటాయి. మాధవరావు పథకానికి శఠగోపం రాహువులా దాపురించాడు.

శఠగోపం గ్రహణంనుండి బయటపడడ మెట్లా అని మాధవరావు ఆలోచిస్తున్నాడు.

మాధవరావు లేనివేళల్లో ఇంట్లో నరసమ్మతో బాతాఖానీ వేస్తాడు శఠగోపం. నరసమ్మఆడబడుచు – శాంతమ్మ మీద విమర్శ చేస్తూఉండడమే ఆయన సంభాషణల సారాంశం. శఠగోపం ఏదయినా పురమాయించేముందు ఒక్క సారి శాంతమ్మమీద ఏమయినా చెబుతాడు.

"మీ ఆడబడుచు శాంతమ్మ ఇంటికి వచ్చిన బంధువులకు పనులు చెబుతుందమ్మా. ఏం అన్యాయమో చూడు,'' అంటాడు శఠగోపం.

"అవ్వ: బంధువులకు ఎవరైనా పనులు చెబుతారా?'' అని నోరు నొక్కుకుంటుంది నరసమ్మ.

"మా కోడలు – నరసమ్మకి మూడో నెల కదా. కడుపుతో ఉన్నదానికి ఎవరైనా పనులు చెబుతారా?''

"అయితే మామయ్యా: మీ కోడలి

పుట్టిల్లు ఏ వూ రన్నావు? వాళ్ళు ఎప్పుడు తీసుకువెళతారు ?''

''రెండు నెలల్లో శ్రీకాకుళం తీసుకు వెడతా రనుకో. అయినా కోడలుపిల్ల మావాడ్ని వదిలి ఉండలేదు నరసమ్మా.

''ఎలాగూ రెండు నెలలలో వెళ్ళి పోయేదానికి, చూలాలికి పనులు చెబు తారా మామయ్యా !''

''నీలాంటివా ళ్ళయితే చెప్పరు నర సమ్మా! కాని మీ ఆడబడుచుశాంతమ్మది రాతి గుండె. అంత నిర్దయురాలు కాబట్టే ఆరు సంవత్సరాల నుంచీ కాపురం చేస్తున్నా యింకా పిల్లలు కలగలేదు,'' అన్నాడు శఠగోపం.

ఆ మాటకు నరసమ్మ మనస్సుకూడా చివుక్కుమంది. నిజానికి ముప్పయి ఏళ్ళ వయస్సున్న నరసమ్మకికూడా అయిదు సంవత్సరాలనుంచీ కాపురం చేస్తు న్నప్పటికీ పిల్లలులేరు. ఒకే పరిస్థితిమీద మనకు ఇష్టం ఉన్నవాళ్ళపట్ల ఒక విధముగానూ, ఇష్టం లేనివారిపట్ల మరొక విధముగానూ వ్యాఖ్యానించడం మన బల హీనత అనుకుంటాను.

నరసమ్మ ముఖం ముడుచుకోవడాన్ని గమనించిన శఠగోపం "నీకుకూడా పిల్లలు లేరని విచారిస్తున్నావు కదూ! నేను నిన్ను ఎందుకంటానమ్మా? నీకు వయస్సు ఏమంత ఎక్కువ. ఇంకా పాతి కేళ్ళు దాటాయో లేదో ?"

నరసమ్మ ముఖం విప్పారింది. వయస్సుకి సంబంధించిన అబద్ధం ఎంత తీయగా ఉంటుంది!

"అవునవును," అంది నరసమ్మ.

"అందుకని ఈ ఏడాది కాకపోతే వచ్చే ఏడాదికైనా నీకు పిల్లలు పుట్టడం ఖాయం. కాని నరసమ్మలాంటి కఠిను రాలికి గొడ్రాలితనం తప్పదు. నా మాట నమ్ము."

"పెద్దవాడివి. నీ ఆశీర్వచనం ఫలిం చక పోతుందా," అన్నది నరసమ్మ తనకు సంబంధించినంతవరకు.

''మీ ఆడబడుచు శాంతమ్మ ఎంత కుళ్ళుబోతుదో చూడు. బంధువుల్ని తీసు కుని వెళ్ళవలసివస్తుందికదా అని గత రెండు నెలలూ సినిమాకి వెళ్ళడం మానేసింది."

''పోనీ,డబ్బులేదేమోమామయ్యా!'' అంది నరసమ్మ. ఎవరికైనా, మరీ అన్యాయంగా విమర్శిస్తే విసుగు వస్తుంది.

"అదుగో, ఆడబడుచుని వెనకేసు కొస్తున్నావు. డబ్బు లేకేం. శాంతమ్మ మొగుడు గోవిందరావు జి. పి. ఎఫ్. అడ్వాన్సు తెప్పించుకున్నాడుకదా. అది చేతిలో ఆడుతూనే ఉంది. డబ్బు లేదంటే ఎవరు నమ్ముతారు ?''

"ఆవిడ అంతేలే మామయ్యా!"

"అంతేకాదు. మీ పిన్నత్త (అనగా నా భార్య) నాంచారమ్మ పెద్దది కదా! ఆవిడచేత పని చేయిస్తుంది. మీ ఆడ బడుచుశాంతమ్మ పైట్టే బాధ పడలేకనే

వాళ్ళ అత్తగారు తన పెద్దకొడుకైన తిరుపతిరావుదగ్గర ఉంటున్నదికదా!"

"పెద్దవాళ్ళచేత పనులు చేయించ డమా. నేను కాపురానికి వచ్చిన ఏడాది లోనే మా అత్తామామలు పోయారుగాని, నే నెప్పుడైనా వాళ్ళచేత పనులు చేయించానా?'

"నువ్వెందుకు చేయిస్తావు? అయితే మా ఆవిడ చాలా మొండిఘటంలే. అలా తేలికగా పనులు చేయదు. ఆవిడ దాటి వోర్వలేక మీ ఆడబడుచే చేసు కుంటుంది."

"ఎవరి కోసం చేసుకుంటుంది మామయ్యా! ఆ మాత్రం బంధుమర్యాద లేకపోతే ఎట్లా?''

"వరహాల విలువచేసే మాట చెప్పా వమ్మా. నీకు తప్పకుండా వచ్చే ఏడాదికి కొడుకు పుడతాడు. అది సరేగాని కాఫీ లోకి కాస్త ఉల్లిపాయల ఉప్మా చేద్దూ, వరసమ్మా!'' అని పురమాయించాడు శఠగోపం.

ఈ విధముగా మరొక నెల గడిచింది. మాధవరావు సేవింగ్సు పూర్తిగా ఖర్చయిపోయాయి.

దిగులుగా మాధవరావు ఆఫీసుకి వెళ్ళివస్తూఉన్నాడు.

ఒకనాడు మధ్యాహ్నం కేంటీనులో కాఫీ త్రాగుతూఉండగా మాధవరావు చిన్ననాటి స్నేహితుడు ఆనందరావు. "హలో మాధవరావు! నీకోసమనే చూస్తున్నానయ్యా,'' అంటూ పలక రించాడు

"ఎప్పుడు వచ్చావు విశాఖపట్నం నుంచి? వాల్తేరు సర్కిలు విశేషాలు ఏమిటి?"

"ప్రొద్దున్నే వచ్చాను. మా తమ్ము డొకడు సివిల్ ఇంజనీరింగు బి. ఇ. పాసయ్యాడు. వాడి పోస్టింగు మా సర్కిలులో వేయించుకుందామని ఇక్క డికి వచ్చాను."

"అవును మరి, నువ్వు ఎస్టాబ్లిష్మెంటు సెక్షనులో ఉన్నావు కదా! అతనిని విశాఖపట్నంలోనే ఉంచుకోవచ్చు ననే కదా?"

"అవును."

"సరేకాని, నీ పని చూసుకుని సాయంత్రం అయిదుగంటలకి కనిపించు; నీతో చెప్పుకుని ఏడ్వవలసిన సమస్య లున్నాయి.''

"సరేలేవయ్యా, అలాగే ఏడుద్దువు గాని," అన్నాడు ఆనందరావు హాస్య ధోరణిలో.

ఆనాటి సాయంత్రం స్నేహితు లిద్దరూ తాజమహల్ హోటల్లో కాఫీ త్రాగి హుసేన్‌సాగర్ చెరువుగట్టుమీద కూర్చున్నారు.

"నే నొక బంధుబాధితుడ్ని; వరద బాధితులు, అగ్నిబాధితులు అయితే నివారణోపాయాలు వెదుకుతారు. వారి సహాయార్థం నాటకాలు ఆడతారు. నిధులు




సేకరిస్తారు. కాని బంధుబాధితులకు కూడా ఏదయినా సాయం చేయాలి," అన్నాడు మాధవరావు ఉపోద్ఘాతంగా.

"ఇంత పిసినారితనం ఉండకూడదయ్యా. మనది అతిధిసత్కారానికి, బంధుమర్యాదలకి పేరుపొందిన భారత దేశం. మన తెలుగుకవులు నాచన సోముడూ, గౌరనా, తెనాలి రామకృష్ణుడూ బంధుమర్యాదను ఎంతో మెచ్చుకుని 'చుట్టాల సురభి' గురించి వారి గ్రంథాలలో వ్రాశారు. మరిచిపోయావా ?''

"మొత్తంమీద తెలుగు బి. ఏ. అనిపించుకున్నావులే. బంధుమర్యాద కూడదని నేను అనడంలేదు. కాని, దానికికూడా హద్దు లున్నాయి. మా ఇంటికి ఒక మహానుభావుడు వచ్చాడు. 'చుట్టమై చూడవచ్చి దయ్యమై పట్టుకున్నాడు' అన్న సామెత ఉండనే ఉంది కదా!" అని శశగోపోపాఖ్యానం వినిపించాడు మాధవరావు.

అంతా విన్న ఆనందరావు, "సారీ బ్రదర్, నిన్ను చూస్తే జాలివేస్తున్నది. అయితే నీకంటె గట్టి చిక్కులో ఉన్నాడు మీ బావ గోవిందరావుగారు. నువ్వు ఒక్క మనిషితోనే వేగలేక పోతున్నావ్. ఆయనపాలిట ముగ్గురు దాపురించారు. చెల్లాయి శాంతమ్మ ఎలా బాధపడుతున్నదో!" అన్నాడు.

"దీనికి పరిష్కారమార్గం చెపుదూ, నీకు పుణ్యం ఉంటుంది.''

"పుణ్యం మాట ఎలా ఉన్నా, ముందు బుర్ర పనిచేయడము లేదు," అన్నాడు ఆనందరావు.

కాస్సేపు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

"ఒక పని చెయ్యకూడదూ! వెంటనే నీ భార్యను పుట్టింటికి పంపించెయ్యి." అన్నాడు ఆనందరావు.

''అవును సుమా! నాకు తట్టనేలేదు. కాని, దీనివల్ల శఠగోపాన్ని వదిలించుకోవచ్చుననుకో; కాని మా బావ గోవిందరావుగారి సమస్య ఎట్లా పరిష్కారం అవుతుంది ?"

''దాన్ని గురించికూడా ఆలోచించుదాము. అప్పుడే తొందరపడి నీ భార్యను పంపించేయకు; రెండు సమస్యలకూ కలిపి ఒకటే పరిష్కారం ఏదయినా ఉందేమో ఆలోచిద్దాం.''

"ఇక ఇంటికి పోదామా?" అంటూ మాధవరావు లేచాడు.

''నే నెందుకులే. నేను హోటలుకి పోతాను.'' అని ఆనందరావుకూడా లేచాడు.

మరునాడు సాయంత్రం ఆనందరావు విశాఖపట్నం వెళ్ళిపోయాడు.

ఒక వారం రోజులు గడిచాయి. ఆనందరావు దగ్గరనుంచి ఉత్తరం లేదు. ఆనందరావు మరిచిపోయాడేమో! 'అతనికి జ్ఞాపకం చేస్తూ ఉత్తరం వ్రాస్తేనో' అనుకున్నాడు మాధవరావు. అయినా మరొకరోజు చూద్దామనుకుని ఆఫీసుకి వెళ్ళాడు.

పదకొండు గంటలకల్లా శఠగోపం మామూలుగా వచ్చి భోజనం చేసి వాలుకుర్చీలో కూర్చున్నాడు.

"మీ ఆడబడుచు శాంతమ్మ వీరావరణవల్లనే ఇక్కడ ఉండిపోవలసి వచ్చిందమ్మా! ఎంత విధిలేని పరిస్థితులు వచ్చినా, మర్యాదా, ఆదరణా లేనిఇంటిలో ఎలా ఉండగలను, నరసమ్మా!'' అన్నాడు శఠగోపం.

"ఏమిటో నువ్వు అభిమానించి అలా అంటున్నావుగాని, నేను మాత్రం ఏమి చేస్తున్నాను మామయ్యా!'' అన్నది నరసమ్మ.

ఇంతలో పోస్టుమేన్ వచ్చి శఠగోపంగారి కొకకార్డు ఇచ్చాడు. ఉత్తరం చదివిన శఠగోపం మందహాసం చేస్తూ "ఇన్నాళ్ళకు మా కష్టాలు తీరాయమ్మా!" అన్నాడు.

''ఏమిటి విశేషం, మామయ్యా!"

''మా అబ్బాయి వెంకట్రావుకి శ్రీకాకుళం బదిలీ అయిందిటమ్మా. వెంటనే రమ్మని వ్రాశాడు.''

"శ్రీకాకుళం అంటే మీకోడలు సుందరమ్మ పుట్టింటి ఊరేకదు మామయ్యా!''

''అవును నరసమ్మా. ఏకంగా సామాను తీసుకునిపోతాము. ఈమాత్రం దానికి మీ ఆడబడుచు శాంతమ్మ మాట దక్కించుకుంది కాదు. పట్టుమని పది నెలలైనా వాళ్ళ ఇంట్లో లేము మేము."

''ఆవిడ గుణాలు ఎవరికి తెలీదు మామయ్యా!''

''అంతేలే అమ్మా! అది సరేకాని ఈరోజే సాయంకాలం ఎక్స్‌ప్రెస్సుకి వెడతాను. దార్లో తినడానికి మాంచి ఉల్లిఉప్మా చేద్దూ; మళ్ళీ ఎన్నాళ్ళకి తింటానో నీ చేతిపాకం!'

"దానికేం భాగ్యం మామయ్యా! కాని ఈరోజునే వెళ్ళాలా? ఆయన వచ్చాక, ఆయనతో చెప్పి పోవచ్చులే."

''అలాకాదు నరసమ్మా! నేను సాయంత్రంబండికే వెళ్ళాలి. అయినా నీతో చెబితే ఒకటీ, మాధరావుతో చెబితే ఒకటీనా?''

"సరే నీ ఇష్టం మామయ్యా!'' అని నరసమ్మ ఉప్మా తయారు చేసే ప్రయత్నంలో పడింది.

మూడుగంటలకి టిఫిను తిని రిక్షావాడిని పిలిచాడు శఠగోపం. శఠగోపం రిక్షా ఎక్కుతూ ఉండగా నరసమ్మ, "ఆయన అన్నమాటలను నువ్వేమీ మనసులో పెట్టుకోకు మామయ్యా!" అంది.

''నాకా పట్టింపు లేవీ లేవమ్మా! ఇంతకూ మాధవరావు మనసు మంచిదవి నాకు తెలీదా. ఇక వెళ్ళొస్తాను, నరసమ్మా!''అన్నాడు రిక్షాలో కూర్చున్న శఠగోపం.

రిక్షా కదిలింది.

మామూలుగా ఇంటికి వచ్చిన మాధవరావుకు జరిగిన సంగతులన్నీ నరసమ్మ చెప్పి "మీతో చెప్పి వెళ్ళమన్నాను సుమండీ. అయినా విన్నాడు కాదు శఠగోపం మామయ్య," అన్నది.

"పరవాలేదులే. ఇప్పుడే వస్తాను తలుపేసుకో" అన్నాడు. మాధవరావు ఆనందోద్రేకాన్ని అణచుకుంటూ.

"అయ్యో, భోజనం చేయకుండా వెడతారేమిటండీ. ఇంకా రైలు ఉంటుందనుకుంటున్నారా?'' అంది నరసమ్మ; మాధవరావు సికిందరాబాదు స్టేషనుకి వెడుతున్నాడనుకుని.

అయితే మాధవరావు రైలుస్టేషనుకి వెళ్ళలేదు. టెలిగ్రాఫ్ ఆఫీసుకి వెళ్ళి విశాఖపట్నంలో ఉన్న ఆనందరావుకి "థాంక్స్" అని ఒకే ఒకమాట టెలిగ్రాం ఇచ్చాడు.